# రక్త గంగ

ర. చ. న.

ఆ ఊరు పెద్ద పల్లె. ఈ దేశంలోని సగటు గ్రామానికి ఉండే అన్ని లక్షణాలనూ సంతరించుకుంది. అందుకనే ఆ వూర్లోనూ ఒక గూడెం ఉంది. మిగతా వూరుతో కలిసి పోయినట్టే కనిపించినా వాస్తవంలో ఆ రెంటికీ మధ్య దూరం అనంతం. ఆ సత్యాన్ని ఆ వూర్లోని సంపన్నులు తరుచు రుజువు చేస్తూ ఉంటే గూడెంలోని ప్రజలకు కిక్కురు మనకుండా ఉండటమే అలవాటు, అవసరం కూడా !

ఆ గూడానికి గుండెకాయలాంటివాడు రాఘవులు. ఆ గుండెకాయని గుప్పిట్లో పెట్టుకున్నాడు వెంకటాద్రి.

• • • • • •

సాయంసంధ్య కరిగిపోతోంది. మెల్లగా అడుగులు వేస్తూ గూడెంవైపు సాగిపోతున్న రాఘవులు అల్లంత దూరాన తన గుడిసెముందు మూగిన తన జనాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు. ఒక్కొక్క అడుగు ముందుకు పడుతూంటే తన వాళ్ళ కళ్ళల్లో కదులుతున్న ఆశలు స్పష్టంగా కనబడుతున్నాయి. మనస్సు చివుక్కుమని, రాఘవుడి తల వంగిపోయింది. నేలబారు చూపులతోటే గుడిసెదాకా వెళ్ళాడు. ఇంకో రెండడుగులు వేస్తే తన కేమీ పట్టనట్టు గుడిసె లోపలికే వెళ్ళిపోయేవాడు.

కానీ... "పోయిన పని ఏటయిందిరా? చెప్పకుండానే లోన కెల్తుండావు?" అన్న కుదింపు రాఘవుడి కాళ్ళని కట్టేసింది.

ఆ కుదింపు ఇచ్చినవాడు ఆ గూడానికి కురువృద్ధు డనదగిన వీరయ్య.

"వాళ్ళ బావిలో మనం నీళ్ళు తోడుకోటానికి వీల్లేదన్నారు వెంకటాద్రి గారు" అన్నాడు రాఘవులు, తనేమీ సాధించలేకపోయానన్న వేదనని మాటల్లో వ్యక్తం చేస్తూ !

"ఈల్లేదంటే ఎట్టారా! నీళ్ళు కరువై నరకయాతన పడతా ఉంటే జనం!" అన్నాడు వీరయ్య కోపంగా.

"మనం జనంకింద లెక్కేంటి వాళ్ళ చూపులకి! జంతువులకిందే లెక్క." రాఘవుడు నిస్పృహపడ్డాడు.

"జంతువులకైనా నీల్లు గావాల గదంట్రా ! సర్పంచి, ఆయన మదుసులు మాత్రమే గాక ఆళ్ళ ఆవులూ, గేదెలూ ఆ బావి నీల్లేగా తాగటం ! ఆళ్ళ జంతువులకన్నా హీనమంట్రా మనం?" అన్నాడు గురవయ్య.

"ఆళ్ళు మనల్ని మడుసుల కింద జమకట్టేది ఒక్క పాలేన్రా! అదీ ఎలచ్చన్ల టయింలో — వోట్లకోసం ! మిగతా సమయాల్లో జంతువులకన్నా హీనంగా కనబడతాం ఆళ్ళ కళ్ళకి" అన్నాడు వెంకటేశం.

"అవున్రా, ఏరు దాటేనాక తెప్ప తగలెట్టాకే రకా లీళ్ళంతా—ఆళ్ళ బుద్దే అంత." సింహాద్రి కస్సుమన్నాడు.

"తెప్పలు తగలెట్టటం ఆళ్ళకి ఎన్నతో పెట్టిన ఇద్యరా! అదట్టా వుంచు—మన బావి ఎండిపోయిందని చెప్పుకున్నాం గందా! బావి లోతు చేయిత్తామని మాటిచ్చి నెల్రోజులు గడిచేపాయె! ఇంతవరకూ అతీ గతీ నేదు" అన్నాడు బద్రి, ఆరిపోయిన బీడికి అగ్గిపుల్ల ముట్టిస్తూ.

"చెప్పిందే చేస్తే ఆది పెజాసామ్యం ఎట్టాగవుద్దిరా? వూరికేనే ఆడివీన బడుతున్నావుగాని!"

రాములు మాటల్లో రాజకీయం వాసన గొట్టింది.

"ఆళ్ళు పెద్దలు, నాయకులు. ఆళ్ళ మాట లిని నెల్లాళ్ళనుంచీ మూడు మైళ్ళు నడిచిపోయి పిల్లేట్లో నీళ్ళు తెచ్చుకుంటున్నాం—మరి మన వోరిమికి ఏ ట్లాబమయింది" అన్నాడు వీరయ్య కంఠం ఒణికిస్తూ.

"ఇంకేటి కావాల్రా—ఆళ్ళ బాయి ముట్టుకోటానికే ఈల్లేదని కట్టడి చేసినారు" అన్నాడు సింహాద్రి.

"ఏరా,రాఘవులూ, నిజమేనంట్రా?" రెట్టించి అడిగాడు మళ్ళీ వీరయ్య.

"ఆడేంటి చెప్తాడే, ఎంకటాద్రి పిల్చి పిలవంగానే ఉరుక్కుంటా ఎల్లి పంచాయతీ మెంబరయిపోయాడు. ఆడు ఈన్ని కాలికింద చెప్పువాగా వత్తుంచినాడు. మరి ఆడి కెదురు సెప్పటానికి ఈడికక్కలేజా లేదుండై?" ఎత్తి పొడిచాడు రాములు.

"ఏదో నాలుగు ముక్కలు సదువుకున్నోడు కదా అని మన గూడానికి నాయకుణ్ణి జేసి ఆళ్ళ కప్పగిస్తే, ఈడు ఆళ్ళు చెప్పిందానికి తాళం ఏస్తా ఉండాడు. లేకపోతే ఈడు గట్టిగ నిలబడితే ఆ ళ్ళిపరేంటి?" అంటూ రాఘవులి కళ్ళలోకి చురుగ్గా చూశాడు వెంకటేశం.

అప్పటివరకూ నోరు మెదపకుండా ఉండిపోయిన రాఘవులు సర్రున లేచి నిలబడ్డాడు—

"ఏమిట్రా మాట్లాడుతున్నారు! మీటింగుల్లో నేనేం మాట్లాడానో, సర్పంచ్‌తో, మిగతా మెంబర్లతో ఎన్ని విధాల పోట్లాడానో మీకేం తెలుసు? వాళ్ళ తలలో నాలుకలా పడి ఉంటానని నన్ను మెంబరుగా పెట్టుకున్నారే గాని మన అవసరాల్ని తీర్చమని అడిగితే ఒప్పుకుంటారనుకోటం ఒట్టి భ్రమ అని తెలుసుకున్నాను. అందుకే మీ పంచాయతీ వద్దు, మీరూ వద్దు అని రాజీనామా వాళ్ళ ముఖాన కొట్టి వచ్చేశాను." ఉక్రోషంతో వూగిపోయాడు.

జనమంతా స్తబ్దులైపోయారు ఒక్క క్షణం. అంతవరకూ రాఘవులు పైన అవాకులు, చవాకులు విసిరిన నోళ్ళు మూగపోయాయి. అప్పుడు వీరయ్యే కలిగించుకొని — "ఏంట్రా, పిల్లాడా, తొందరపడి పొయ్యావేమోరా? ఇంత చిన్న విషయానికి ఆళ్ళతో జెట్టీ కొట్టుకుంటే బతగ్గలమేంటి?" అన్నాడు భయం భయంగా.

"ఇది చిన్న విషయమా? నాలుక లెండిపోయి, ప్రాణాలే ఎగిరిపోయేట్టుంటే ఇది చిన్న విషయ మెట్టా అవుద్దో నీ ఎర్రిగాని? వాళ్ళ ఇళ్ళకి దగ్గరుంది గనక ఆ నుయ్యి వాళ్ళు వాడుకుంటున్నారు. అమాత్రానికే వాళ్ళ సొంత దవుద్దా ఆ నుయ్యి? అది వూరి బావి. వూరందరి బావి. మనం వాడుకోనంతమాత్రాన మనకు దానిమీద హక్కు లేకుండా పోదు." వివరంగా చెప్పాడు రాఘవులు, వీరయ్యకు దగ్గరగా కూర్చొని.

"భలే ! భలే! బాగా సెప్పినావురా—మన మెళ్ళి అందులో నీళ్ళు దెచ్చుకుంటే ఏటవుద్దంటావు?" అన్నాడు రాములు ఉత్సాహంగా లేచి నిల్చొని.

"ఆ... ఏమవుద్ది! ఎత్తి కుదేస్తే రెండవుద్ది ! ఆళ్ళేద్దంటారు, మనం ఆళ్ళ మాట్ట లినం. నీయక్క—సై అంటే సై..." ఆవేశంతో అన్నాడు వెంకటేశం.

"అవును. మన కిక మార్గం లేదు. ధైర్యంగా వెళ్ళి మన హక్కుని సాధించుకుందాం." వెంకటేశం ఉత్సాహానికి వూపిరిపోశాడు రాఘవులు.

"ఒరేయ్—అట్లా జేస్తే మనం ఆళ్ళ మీద తిరగబడ్డామని బొక్కలో మూకితే ? కన్ను పోయినంత కాటుక ఏంటేకిరా?" కుర్ర కారు ఉత్సాహాన్ని నీరు కారుస్తూ అన్నాడు వీరయ్య.

"నువ్వాగరా, ముసిలీ! రేపట మాపట సచ్చేటోడివి నీకేటి దిగులు! అయిందానికి కావ్దానికి ఆళ్ళ మాటకి మనం లొంగిపోతా ఉంటే ఈ రాజ్జంలో మనకి చావులే మిగుల్తాయి" అంటూ సింహాద్రి కళ్ళు ఎర్రచేశాడు.

రాఘవుల్లో ఆవేశం మరింత ప్రకోపించింది.

"అయితే ... పదండి ఇప్పుడే!" అన్నాడు పిడికిలి బిగించి.

"వూ...పదండి! ఏమయితే అదే అవుద్ది" అన్నాడు రాములు తనూ పిడికిలి బిగిస్తూ !

"ఆ...లేవండి—అందరూ చేదలూ, చాంతాళ్ళూ పట్టండి. అందరం కలిసే వెళదాం!" రాఘవులి కంఠం మరోసారి గర్జించింది.

దశమినాటి చంద్రుడు కాగడా పట్టి దారి చూపుతున్నట్టుగా వెన్నెల విరజిమ్ముతున్నాడు. వూరికి నడిబొడ్డున,



వెంకటాద్రి ఇంటికి దగ్గర్లోనే ఉన్న బావిలో ఒక్కసారిగా జలకంపం పుట్టింది. గంగ కడవల్లో గూడెంలోకి వడవసాగింది.

పది నిమిషాల తరువాత...!

"ఆగండి."

ఆ కేక విని గిలకల చలనం ఆగలేదు. నిమిత్తమాత్రంగా తల లెత్తి చూశారు జనం.

వెంకటాద్రి అనుచరులతో, అంగరక్షకులతో ప్రత్యక్షమయ్యాడక్కడ!

"దొంగ వెధవల్లారా! ఏమిట్రా మీరు చేస్తున్న పని." ఉరిమాడు అవ్యాపదేశంగా వెంకటాద్రి.

జనంలో ఉలుకూ పలుకూ లేదు. గిలకల హార్దధ్వానాలు ఆగనూలేదు.

"ఒరేయ్ రాఘవులూ, కమిటీ మీటింగులో ఏం చెప్పాన్రా నీకు?" గద్దించాడు వెంకటాద్రి.

"నీళ్ళు తోడుకోవద్దన్నారు."

"మరి మీరు చేస్తున్న పనేమిటి?"

"మీరు వద్దన్న పని!"

"ఏరా, అంత బలిసిపోయిందా ఒళ్ళు! మత్తులో ఉన్నావా? మదమెక్కిందా? పెద్దాళ్ళతో మాట్లాడాల్సిన పద్ధతి ఇదేనా?" అన్నాడు వెంకటాద్రి నోట్లో నాలుకగా పని చేసే సీతాపతి!

"మదమెక్కేది — జనం సొమ్ము తిని కూర్చునే వాళ్ళకి గాని కండలు కరిగించి తిండి గింజలు సంపాదించుకొనే వాళ్ళకు కాదు!" రాఘవులు తెగించి తలపడ్డాడు.

"ఏడి వ్యవహారం మరీ ముదిరింది, వెంకటాద్రిగారూ!" సీతాపతి అగ్గి రగిల్చాడు.

"ముదురుద్దయ్యా! ముదురుద్ది! ఈనా కొడుకులకి కూలీ నలీ దొరుకుతా ఉండి, లయిదేళ్ళానోట్లో కెల్తా ఉంటే ముదరకేమవుద్ది!" వెంకటాద్రి ముఖం చిట్లించాడు.

"ఇందాకట్నుంచీ చూస్తున్నాను! ఏందండీ నువ్వనేది? పూరుకుంటా ఉంటే మరీ ఎక్కువై పోతుండది. నీ బెదిరింపులకి దద్దే రోజులు పోయాయ్, బాబూ! అయినా నాకు తెలవకడుగుతాను — మేం నీకేం అపకారం చేశామని మమ్మల్నిట్టా ఏడిపిస్తుండవు? నెల్లాళ్ళనాడు మా బాయి లోతు తీయిత్తమని జెప్పినోళ్ళు తిరిగి సూద్దయినా లేదే!" రాములు మాటల్లో కరుకు కరుకుదనం, వినయం జంటగా ధ్వనించాయి.

"ఓరి కడనా కొడకా! అయ్యగార్ని నిలదీసేపాటి. వాడి వయ్యారం! చేసిందానికి లెంప వేసుకుని అయ్యగారి కాళ్ళ మీద పడు. లేదా మస్తై పోగలవు— జాగ్రత్త!" కరణం బెదరించాడు.

"మీ ఈ తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరవు, పంతులూ! మా తప్పేంటో సెప్పమంటే సెప్పవేం?" వెంకటేశం నిగ్గతీశాడు.

"ఏందోయ్ నీకు సెప్పేది? ఎరగనట్టే అడుగుతుండావ్! వూరి బాయి మీరు ముట్టుకుంటే మైలపడిపోద్దన్న గ్యానం ఉందట్రా? మీరంటుకున్న నీళ్లు మేమెట్టాత్రాగేంరా!" మునసబు దబాయింపులో ఆవేదన ధ్వనించింది.

"వూరు మంద్దైనప్పుడు బాయి మంది కాకుండా పోతుందాండీ!" వీరయ్య వణుకుతూ రాఘవులు పక్కన చేరాడు.

"మీరు తాగే బాయి నీళ్ళు మేం తాగకూడదేంటండీ! మేం మీలాగా మదుములంకామా!" సింహాద్రి ఆవేశంలో అమాయకంగా అడిగాడు.

"మీరు మడుసులేట్రా! మడుసులే! కానీ మీరు గూడెం మడుసులు. మరి గూడెం మడుసులు ఏనాడైనా వూర్లో బాయి నీళ్ళు తాగారేంట్రా—

ఏరా, ఈరిగా, సెప్పవేంరా నీ మనమడికి"' అన్నాడు మునసబు చుట్ట వెలిగిస్తూ.

"ముందునుయ్యి ఎనకగొయ్యి అన్నట్టుండాది బాబూ, నా పని. నేన్జెప్పటం ఆల్లిలటం కూడా నా ఇంకా! పెద్దంతరం సిన్నంతరం అన్నీ సచ్చిపోనాయి, దొరా!" వీరయ్య బాధతో కళ్ళొత్తుకున్నాడు.

"నువ్వాగవే! ఈ పెద్దోళ్ళకి మర్యాదిచ్చిన కొద్దీ మరీ నెత్తికెక్కి కూర్చోటం అలవాటైపోయింది. పెద్దా లేదు, చిన్నా లేదు... ఇహనించీ వూరువేరూ గూడెం వేరూ కానేకాదు. అంతా ఒక్కటే" అంటూ చేద బావిలో వేశాడు రాఘవులు.

రాఘవులి తృణీకారంహడలెత్తించింది. అతని చొరవ వెనుక ఎంతటి బలం, గుండె ధైర్యం ఉన్నాయో, అది ఎలాంటి పరిణామాలకి దారి తీస్తుందో నన్న సంగతి కళ్ళ ముందు దృశ్యంగా కనపడ్డాయి వెంకటాద్రికి.

అంతే! మరింక ఆలస్యం చేయకుండా తాత్కాలికంగా నైనా తోక ముడవటం శ్రేయస్కర మనిపించింది.

"ఒరేయ్! ఇప్పు డీ సీకట్లో నీతో వాదులాట ఏంటిగ్గాని రేపు రచ్చబండ కాడ పంచాయతీ బెడతా! నువు చేసిన పనికి సిచ్చేందో ఆడ్నే సెప్తా! అప్పుడు తెలుస్తుంది — నీ పొగరు, వగరు!" అని చకచకా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు తనవాండ్లతో వెంకటాద్రి.

• • •

వెంకటాద్రి తలమీద పంకా తిరుగుతూ ఫెళ్ళున కాసే ఎండ తీవ్రతను తగ్గిస్తున్నది. కానీ, లోపల్నుంచి పుట్టుకొస్తున్న కోపాగ్నితో అతని శరీరం ఆవిర్లు కక్కుతూంది.

"వాడు వెయ్యి రూపాయిలు తప్పు కట్టాడట. వూరు విడిచిపోనూ పోడట" అన్నాడు సీతాపతి మెల్లగా.

"అంతేనా! నెల రోజుల్నుంచీ వెధవల్ని కూలి పనికి రాకుండా కట్టుదిట్టం చేశాం! అయినా రాఘవుల్ని గూడెం గూడెంనెత్తినెట్టుకొని వూరేగుతున్నారు" అన్నాడు మరో మెంబరు—చలపతి.

"అంతటితో వూరుకున్నారా? పొరుగూళ్ళ నుంచి కూడా కూలీలు రాకుండా కట్టడి చేశారు. ఎంత గుండెలు తీసిన బంట్లు కాకపోతే మనల్ని వెంట్రుకతో సమానంగా చూస్తారూ?" ఆజ్యం పోస్తున్నాడు సీతాపతి.

"కాని మన బావిలోంచి నీళ్ళు తీసుకుపోవటం మాత్రం మానలేదు. ఆ మైలపడ్డ నీళ్ళనే మన నోట్లో పోసుకోవాల్సొస్తూంది" అన్నాడు పూజారి, జంధ్యం సవరించుకుంటూ.

"వోరి, చాదస్తపు పంతులూ! ఇంకెక్కడి మన బావి? అది అందరిదీ అంటున్నారు వాళ్ళు" అన్నాడు మునసబు.

"పోపీ ఏదన్నా మందు కలిపి ఈ వెధవల్ని ఏదన్నా చేద్దామన్నా మనకూ ఆ నీళ్ళే దిక్కయ్యె కదా!" అన్నాడు వెంకటాద్రి ఆరిపోయిన చుట్టని అవతల పారేస్తూ.

"కూలీజనం లేక మా రెండు మిల్లులూ మూతబడ్డాయి కదా! ఎంత నష్టం! ఎంత నష్టం!" అంటూ గుండె బాదుకున్నాడు కరణం.

"సువ్వాగవయ్యా! ఇప్పు డా సంగతెందుకు గుర్తు చేస్తావు? అసలే నా మనసు బేజారవుతుంటే..." కసురుకున్నాడు వెంకటాద్రి.

"ఇంత అనర్థానికి కారణం ఎవరో మనకు తెలుసు కదా! గూడాన్నంతటినీ ఒక్కమాట మీద నిలబెట్టి, ఒక్కతాటి మీద నడిపిస్తున్నాడు ఆ చదువుకున్న గాడిద కొడుకు—అందుకనే ఈ పేద కొడుకులకి చదువు నేర్పకూడదంటాను!" అన్నాడు మునసబు తన కేదో పెద్ద మాస్టరు డిగ్రీ ఉన్నట్టు.

"ఆ గాడిద చెపితే మాత్రం ఈ గొర్రెలు తోకాడించటమేమిటి, మునసబూ! అందరూ దొంగనాయాళ్ళే! ఆళ్ళ కెట్లా బుద్ధి చెప్పాలో వెంకటాద్రి గారే నిర్ణయించాలి. మనమెంత చెప్పు" అన్నాడు చలపతి పైన తిరుగుతున్న పంకాను తదేకంగా చూస్తూ.

వాళ్ళందరి మాటల్ని మననం చేసుకుంటూ వెంకటాద్రి ఆలోచనలో పడ్డాడు.

• • •

ఆ చీకటి రాత్రి . . .

గూడెం జనం నీళ్ళకోసం బావి దగ్గరికి చేరారు. కొద్దిసేపటికి గిలకల కిసకిసల శబ్దం మిన్నుముట్ట సాగింది. మరికొంత సేపటికే గిలకల శబ్దాన్ని మింగేస్తూ తుపాకులు కఠోరంగా పేలాయి.

మరి కొన్ని క్షణాల్లో వలయంగా తిరుగుతున్న గిలకల వేగం సన్నగిల్లిపోయింది. దాని స్థానే ఆర్తనాదాలు ఆకాశాన్ని చీల్చుకొని వూరంతా వ్యాపించాయి.

• • •

ఆ రాత్రి అక్కడ ఆ బావి గట్టున నీళ్ళకు తోడుగా రక్తం పారినా ఆ గూడెంలోకి గంగమాత్రం ప్రవహించటం మానుకోలేదు. ★

నూతన యవ్వనం పొందండి.
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టుద్వారా చికిత్స కలదు
ప్రతి ఆదివారము భీమవరం - షణ్ముఖలాడ్జి నందు
ఉ॥ 9 నుండి సా॥ 6-30 వరకు క్యాంపు కలదు.

డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్
సెక్సు అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్క్ రోడ్, గుడివాడ-521 301.
ఫోన్స్ : 522 అండ్ 540

